

అదే జోష్..!

● యుగ పురుషుడికి ఘననివాళి
● ఎన్టీఆర్‌కు ఇష్టమైన వంటలు వడ్డింపు
● రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై విస్తృతంగా చర్చ
● పలు తీర్మానాలపై చర్చ
● పదిరోజుల్లో ఉక్కు ఫ్యాక్టరీ పనులు

● రెండోరోజూ వేడుకగా మహానాడు



మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు

కడప నగర శివారులోని పబ్బాపురంలో నిర్వహిస్తున్న మహానాడు రెండోరోజు బుధవారం కూడా మాంచి జోష్‌లో సాగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇతర నేతల ప్రసంగాలు కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాయి. బుధవారం ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని యుగ పురుషుడికి సీఎం చంద్రబాబు సహా అందరూ ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని వేదిక తెరపై చూపించినప్పుడల్లా గ్యాలరీలో ఉన్న పార్టీ నేతలు చప్పట్లు కొడుతూ జై ఎన్టీఆర్ అంటూ నినదించారు. ఎన్టీఆర్‌కు ఇష్టమైన వంటలను నేతలందరికీ వడ్డించారు. చంద్రబాబు ప్రసంగిస్తూ 10 రోజుల్లో కడప ఉక్కుఫ్యాక్టరీ పనులు ప్రారంభిస్తామనడంతో జిల్లా వాసుల్లో మరింత జోష్ పెరిగింది.



● ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్నప్పుడు గ్యాలరీలోని పార్టీ కేడరు జోహార్ ఎన్టీఆర్ అంటూ నినదించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో రూపొందించిన వీడియోలో ఎన్టీఆర్ మాట్లాడుతున్నప్పుడు గ్యాలరీలోని కేడరు అంతా గట్టిగా చప్పట్లు కొట్టారు.
● ఎన్టీఆర్ గురించి చంద్రబాబు ప్రసంగిస్తున్నప్పుడు జై బాబు జైజై బాబు.. ఎన్టీఆర్ అమర్‌హై అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు.



● యోగాంధ్రపై చర్చ సందర్భంగా చంద్రబాబు అందరితో దీర్ఘశ్వాస తీయించారు. ఇప్పుడు ఎలా ఉంది. వత్తిడి తగ్గిందా అంటూ కార్యకర్తలను అడిగారు. మీలో ఎంతమంది యోగా నేర్చుకున్నారు. జూన్ 21న వైజాగ్‌లో ఐదు లక్షల మందితో రాష్ట్రంలో 2 లక్షల మందితో యోగాను నిర్వహిస్తున్నాం. మీరంతా పాల్గొనాలి. మీరంతా సిద్ధమేనా అంటూ చంద్రబాబు ప్రశ్నించగా సిద్ధం.. సిద్ధం అంటూ గ్యాలరీలో నుంచి చేతులెత్తారు. మీతో పాటు పైన డయాసిస్ మీద నాయకులకు అవసరం.. మీరంతా స్ట్రెస్‌లో ఉన్నారంటూ చంద్రబాబు అనడంతో వేదికపై ఉన్న నేతలతో పాటు గ్యాలరీలో ఉన్న నాయకులు నవ్వారు.

మహానాడుకు వెళ్లే దారిలో వాహనాల రద్దీ..



(కడప-ఆంధ్రజ్యోతి): మహానాడులో రెండోరోజు బుధవారం పలు అంశాలపై తీర్మానాలను ప్రవేశపెట్టి చర్చించారు.

● 10 గంటల నుంచి 10.45 వరకు సీఎం చంద్రబాబుతో సహా లోకేశ్ ఇతర నేతలు వేదికపైకి వచ్చారు. ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా ఎన్టీఆర్‌కు నివాళులర్పించారు. ఎన్టీఆర్‌తో తమకున్న అనుబంధాన్ని.. ఆయన సినీ రాజకీయ జీవితాన్ని అశోక్‌గజపతిరాజు, బుచ్చయ్యచౌదరి, చినరాజప్ప వివరించారు.

● 10.45కు ఎన్టీఆర్‌పై రూపొందించిన ఆర్టిఫిషియల్ వీడియోను ప్రదర్శించారు. ఎన్టీఆర్ పార్టీ స్థాపన, పేదల కోసం పెట్టిన సంక్షేమ పథకాలు. కిలో రూ.2 బియ్యం, తన వారసత్వాన్ని చంద్రబాబు కొనసాగిస్తూ హైదరాబాదులో సైబర్‌వాల్ నిర్మాణం, కార్యకర్తలతో మనవడు లోకేశ్ మమేకం కావడం, వారసత్వాన్ని చాటుకుంటున్నాడంటూ చెప్పిన నాలుగు నిమిషాల వీడియో విశేషంగా ఆకట్టుకుంది. చంద్రబాబు చెప్పే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ అంటే ఇదే అంటూ వ్యాఖ్యాతగా వ్యవహరించిన మంత్రి పయ్యావుల కేశవ్ వెల్లడించారు.

● 10.50 నుంచి 11.03 వరకు చంద్రబాబు ప్రసంగం.

● 11.04కు తెలుగుజాతి విశ్వఖ్యాతిపై ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తీర్మానాన్ని ప్రవేశపెట్టగా నన్నూరి నర్సిరెడ్డి బలపరిచారు.

● 11.25 గంటలకు 'రాష్ట్రం విధ్వంసం నుంచి పునర్నిర్మాణం వైపు అడుగులు' తీర్మానాన్ని ధూళిపాళ్ల నరేంద్ర ప్రతిపాదించగా.. ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, పుత్తా కృష్ణచైతన్యరెడ్డి బలపరిచారు.

● 12.30కి రాష్ట్రాభివృద్ధికి కేంద్ర సహకారంపై కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తీర్మానం ప్రవేశపెట్టారు.

● 12.40 గంటలకు యువగళం పాదయాత్రలో అనుభవాలను పాదయాత్రపై రూపొందించిన పుస్తకాన్ని మంత్రి నారా లోకేశ్ సీఎం చంద్రబాబుకు అందించారు.

● 1.35 గంటలకు యోగాంధ్రప్రదేశ్‌పై ఏలూరు సాంబశివరావు తీర్మానం ప్రవేశపెట్టారు. 1.45 నుంచి 2.03 గంటల వరకు యోగాంధ్రపై చంద్రబాబు ప్రసంగించారు. ఈ సందర్భంగా యోగా ప్రాముఖ్యతపై వివరిస్తూ అందరితో ప్రాణాయామం చేయించారు.

● 2.04 గంటలకు మౌలిక సదుపాయాలతో మారనున్న ముఖచిత్రం రహదారులు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అభివృద్ధిపై ఎమ్మెల్యే గౌతు శిరీష తీర్మానం ప్రవేశపెట్టగా మూల రామాంజనేయులు ఆమోదించారు.

● 2.20కి విద్యుత్‌రంగంపై మంత్రి గొట్టిపాటి రవికుమార్ తీర్మానం ప్రవేశపెట్టగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు చుక్కా సాయిబాబా బలపరిచారు.

● 2.51కి సమగ్ర సాగునీటి రంగంతో ఉజ్వల ప్రగతిపై మంత్రి నిమ్మల రామానాయుడు తీర్మానం ప్రవేశపెట్టగా.. ఎమ్మెల్యే జయనాగేశ్వర్‌రెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి బలపరిచారు.

● 3.20 గంటలకు తెలంగాణ వ్యవసాయం, సాగునీటి ప్రాజెక్టులపై తెలంగాణ నేత నెల్లూరు దుర్గాప్రసాద్ తీర్మానం ప్రవేశపెట్టి చర్చ జరిపారు.

● 3.34 గంటలకు ప్రజల సంరక్షణ, శాంతిభద్రతల పరిరక్షణకు మంత్రి బీసీ జనార్ధనరెడి తీర్మానం ప్రవేశపెట్టగా ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, వీరంగి గురుమూర్తి, అధికార ప్రతినిధి మోకా ఆనంద్‌సాగర్ బలపరిచారు.

● 4.03కు సూపర్‌సిక్స్‌పై పట్టాభి తీర్మానం ప్రవేశపెట్టారు.

● 4.16కు ఎంపీ భరత్ పర్యాటక అభివృద్ధికి పటిష్ట చర్యలపై తీర్మానం ప్రవేశపెట్టారు.

● 4.28 గంటలకు రాజకీయ తీర్మానాన్ని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రవేశపెట్టగా ఎం.షరీఫ్, అమర్‌నాథరెడ్డి బలపరిచారు.

● 5గంటల నుంచి జాతీయ అధ్యక్షుల ఎన్నిక ప్రకటన, ప్రమాణ స్వీకారోత్సవం, జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు ప్రసంగం, 7 గంటల దాకా సాగింది.



విజయదుర్గ గుడిలో మంత్రి కొల్లు రవీంద్రకు అమ్మవారి పట్టు వస్త్రాలను అందజేస్తున్న ఆలయ నిర్వాహకులు దుర్గాప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్



దివ్యాంగుల అభిమానం

తెలుగుదేశం పార్టీపై అభిమానంతో దివ్యాంగులు సుదూర ప్రాంతం నుంచి కడపలో జరిగే మహానాడుకు చేరుకున్నారు. ప్రకాశం జిల్లా దర్శి, అనంతపురం జిల్లా నుంచి దివ్యాంగులు వారి వాహనాల్లో రెండు రోజులు ప్రయాణం చేసి మహానాడుకు చేరుకున్నారు. చూసిన వారంతా.. పార్టీపై వీరికి ఎంత ప్రేమో అని చర్చించుకున్నారు.

సైడ్‌లైట్స్ :

● రెండోరోజు మహానాడులో కూడా మాంచి జోష్ సాగింది. ప్రసంగాల సందర్భంగా గ్యాలరీలో నుంచి నేతలు చప్పట్లు కొట్టి కేకలు, విజిల్స్‌తో హర్షం వ్యక్తం చేశారు.

● వివేకా మర్డరును సాక్షి చానెల్‌లో గుండెపోటుగా ప్రసారం చేశారు. నేను కూడా అదే నమ్మా.. సాయంత్రానికి దిమ్మతిరిగే వాస్తవాలు బయటకు వచ్చాయి. నా పైన 'నారాసుర రక్తచరిత్ర' అంటూ ఫొటోలు పెట్టి కథనం వేశారు. దీన్ని మీరు ఆమోదిస్తారా అనగా... లేదు లేదంటూ బిగ్గరగా నినాదాలు చేశారు.

● తెలంగాణ నేత నర్సిరెడ్డి ప్రసంగం విశేషంగా ఆకట్టుకుంది. వేదికపై నేతలతో సహా గ్యాలరీలో ఉన్న పార్టీ నేతలు ఆసక్తిగా విన్నారు. 'మా దగ్గర ముక్కోడు పాయే, మీ దగ్గర తిక్కోడు పాయే' అంటూ అటు కేసీఆర్, ఇటు జగన్‌ను ఉద్దేశించి వ్యాఖ్యానించడంతో గ్యాలరీలో ఉన్న నాయకులతో పాటు వేదికపై ఉన్న నేతలు కిలకిలా నవ్వారు. మీవోడు ఆత్మలతో మాట్లాడుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నాడు అనడంతో చప్పట్లతో కేకలు వేశారు.

● కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు ప్రసంగం చేస్తున్నప్పుడు గ్యాలరీలో నుంచి నాయకులు చప్పట్లు కొడుతూ కేకలు వేస్తూ నినాదాలు చేశారు. 12 ఏళ్ల కిందట తెలిసి తెలియని టైంలో హైదరాబాదు మహానాడులో ప్రసంగించానని.. ఇప్పుడు చిన్నవయసులోనే కేంద్రమంత్రి అయ్యానని, దీనికి చంద్రబాబే కారణమనడంతో గ్యాలరీలో నుంచి కార్యకర్తలు పెద్దఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ టీడీపీ స్థాపన, ఎంతోమంది బడుగులకు రాజకీయం ప్రస్థానం, అభివృద్ధి, లోకేశ్ ఐడియాలజీ గురించి వివరించినప్పుడు పెద్దఎత్తున హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. ప్రసంగం అనంతరం చంద్రబాబు రామ్మోహన్‌నాయుడును హత్తుకున్నారు. చంద్రబాబుకు రామ్మోహన్‌నాయుడు పాదాభివందనం చేశారు.

● చంద్రబాబు జాతీయ అధ్యక్షుడిగా ఎన్నిక కావడం, ప్రమాణ స్వీకారోత్సవం.. ఆయన ప్రసంగానికి కేడరు హర్షధ్వానాలతో జై బాబు అంటూ కేకలు వేశారు.

● అనంతపురం జిల్లా పెనుగొండ నుంచి మహానాడుకు సైకిల్‌యాత్రలో తెలుగు తమ్ముళ్లు వచ్చారు. పెనుగొండ నియోజకవర్గం నుంచి 45 మంది మంత్రి సవిత యువసేన మూడు రోజులపాటు 200 కి.మీ. సైకిల్‌యాత్ర చేసి బుధవారం మహానాడు ప్రాంగణానికి చేరుకున్నారు. మంత్రి వారికి స్వాగతం పలికారు.



చంద్రబాబునాయుడుతో ఎమ్మెల్యే మాధవి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి



● తల్లికి వందనం పథకంలో భాగంగా ఎంత మంది పిల్లలుంటే అంత మందికి జూన్ 12న ఒక్కొక్కరికి రూ.15 వేలు ఖాతాలో వేస్తాం, మా ఆడపడుచులకు ఆగస్టు 15న ఉచిత బస్సు పథకం అమలు చేస్తాం అంటూ చంద్రబాబు ప్రకటించడంతో మహిళా కార్యకర్తలు ఒక్కసారిగా చప్పట్లు కొడుతూ జై చంద్రబాబు అంటూ కేకలు వేశారు. మహానాడుకు పురుషులతో సమానంగా మహిళలు వచ్చేలా పార్టీలో ప్రాధాన్యత కల్పిస్తామని చంద్రబాబు చెప్పడంతో మహిళలు హర్షం వ్యక్తం చేశారు.



రాజంపేటలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు



మహానాడు వేదికపై మంత్రులతో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



వైద్య శిబిరాలకు విశేష స్పందన

మహానాడులో జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది. మహానాడుకు హాజరైన ఆయా ప్రతినిధులు వైద్య శిబిరాలకు చేరుకుని బీపీ, షుగర్, తదితర వైద్య పరీక్షలను చేయించుకున్నారు. ప్రతినిధుల భోజనశాలలో ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ వరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు వైద్యసేవలు అందించారు. పరీక్షలు చేయించుకున్న వారితో పాటు అవసరం ఉన్నవారికి ఉచితంగా పలు రకాల మందులు అందించారు.



మహానాడులో వేదికపై టీడీపీ రాజంపేట పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు



ముఖ్యమంత్రి చంద్రబాబును తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడిగా ఎన్నుకున్న సందర్భంగా చంద్రబాబుకు 10 కేజీల వెండిగద బహూకరిస్తున్న టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్. గోవర్ధన్ రెడ్డి



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రెడ్డెప్పగారి శ్రవణ్ రాజ్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస రెడ్డి, కడప ఎమ్మెల్యే మాధవి



మంత్రి నారా లోకేశ్‌తో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



చంద్రబాబునాయుడుకు దేవుని కడప వెంకటేశ్వరస్వామి జ్ఞాపికను అందజేస్తున్న కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ భూపేష్‌రెడ్డి, బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రితేష్ కుమార్ రెడ్డి



వేడుకలా మహానాడు

(కడప-ఆంధ్రజ్యోతి): కడప గడపలో జరుగుతున్న మహానాడు వేడుకలా జరుగుతోంది. మొదటిరోజు విజయవంతం కావడంతో రెండోరోజు కూడా నాయకులు, కార్యకర్తలు వేలాదిగా తరలివచ్చారు. మహానాడు ప్రాంగణమంతా పసుపుమయంగా మారిపోయింది.

● కడపలో పండగ వాతావరణం



కడపలో మూడు రోజుల పసుపు పండుగ వైభవంగా జరుగుతుండటం సంతోషంగా ఉంది. ఇక్కడ మహానాడు నిర్వహించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అవకాశం ఇచ్చారు. అందుకు తగ్గట్టుగానే ఏర్పాట్లు బ్రహ్మాండంగా చేశాం. మొదటిరోజు బాగా సక్సెస్ కావడంతో ముఖ్యమంత్రి కూడా అభినందించారు. రెండోరోజు కూడా అంతకు రెట్టింపుగా జరుగుతోంది. అసలైన కార్యక్రమం మూడోరోజు భారీ బహిరంగ సభ. ఈ సభను ఐదు లక్షల మందితో నిర్వహిస్తున్నాం. వైఎస్ విగ్రహాల వద్ద జెండాలు కట్టినందుకు వైసీపీ ఏదేదో మాట్లాడుతోంది. జెండాలతో కూడళ్లలో అలంకరించుకోవడం సర్వసాధారణం. అయినప్పటికీ వాటిని తొలగించాం.

- శ్రీనివాసరెడ్డి, పొలిట్‌బ్యూరో సభ్యుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు

● వచ్చే ఎన్నికల్లో వివేకా-2 సినిమా చూపిస్తారా!



వచ్చే ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి సినిమా చూపిస్తా అంటున్నాడు. ఏ సినిమా చూపిస్తారో చెప్పాలి. మొన్న ఎన్నికల్లో వివేకా-1 సినిమా చూపించారు. వచ్చే ఎన్నికల్లో వివేకా-2 సినిమానే చూపించాలి. జగన్ వచ్చే ఎన్నికల నాటికి ఎన్నికల్లో పోటీ చేసేందుకు డిస్‌క్వాలీఫై కాకుండా చూసుకోవాలి. గాలి జనార్దన్‌రెడ్డి మాదిరి శిక్ష పడితే ఎన్నికల్లో పోటీ చేయలేరు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడే దేనికీ భయపడలేదు. ఇప్పుడు తాటాకు చప్పుళ్లకు భయపడతానని అనుకోవడం జగన్ అవివేకం.

- బీటెక్ రవి, మాజీ ఎమ్మెల్సీ, పులివెందుల టీడీపీ ఇన్‌చార్జ్

● మద్యం కుంభకోణం ముప్పై వేల కోట్ల పైనే..



ఢిల్లీ మాజీ సీఎం కేజ్రీవాల్ మద్యం స్కాం విలువ కేవలం వంద కోట్ల రూపాయలు మాత్రమే. వైసీపీ కాలంలో జరిగిన మద్యం కుంభకోణం విలువ రూ.30 వేల కోట్లకు పైనే. ఇదే విషయాన్ని విజయసాయిరెడ్డే చెప్పాడు. కూటమి ప్రభుత్వం కక్ష సాధింపులకు పాల్పడడం లేదు. అలా అయితే మేము అధికారంలోకి వచ్చిన మొదట్లోనే అరెస్టులు జరిగేవి. మద్యం స్కాంలో తప్పు చేసిన వాళ్లు ఎవరైనా వదిలి పెట్టేది లేదు. గురువారం 5 లక్షల మందితో జరగబోయే బహిరంగ సభను చూస్తే.. జగన్‌కు అర్థం అవుతుంది.. కడప టీడీపీ అడ్డా అని..

- మాజీ ఎమ్మెల్సీ దీపక్‌రెడ్డి

● యుగపురుషుడు ఎన్టీఆర్..



సినీ నాయకుడిగా ప్రస్థానం ప్రారంభించిన నందమూరి రామారావు టీడీపీని స్థాపించి 9 నెలల్లోనే ముఖ్యమంత్రి అయ్యారు. కిలో రెండు రూపాయల బియ్యం పథకంతో పాటు పట్వారీ వ్యవస్థ రద్దు.. మహిళలకు ఆస్తిలో హక్కు వంటి అనేక ప్రజా సంక్షేమ పథకాలు పెట్టి పేదల మనసులు గెలుచుకున్న యుగపురుషుడు రామారావు. కడపలో చారిత్రాత్మక మహానాడుగా నిలిచిపోతుంది.

- పట్టాభిరామ్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్

● ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి..



దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావుకు ఇప్పటికైనా భారతరత్న ప్రకటించాలి. తెలుగుజాతి కీర్తిప్రతిష్టలు ప్రపంచం నలుదిశలా చాటిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్. ఆయనకు భారతరత్న ఇవ్వాలని పది సంవత్సరాలుగా నేను డిమాండ్ చేస్తూనే ఉన్నా. ఇప్పుడు అందుకు అనువైన సమయం రానే వచ్చింది.

- బాబూరావు, మైలవరం, ఎన్టీఆర్ జిల్లా

● టీటీడీలో అవినీతి ప్రక్షాళన..

టీటీడీలో అవినీతి ప్రక్షాళన జరిగి తీరుతుంది. లడ్డూ అవినీతి కేసులో బాధ్యులందరికీ త్వరలో శిక్ష తప్పదు. హిందూ ధార్మిక వ్యవస్థపై నమ్మకం లేని అన్యమతస్తులను తొలగిస్తున్నాం. మహానాడులో లోకేశ్ మార్క్ స్పష్టంగా కనిపిస్తోంది. లోకేశ్‌కు పార్టీలో పెద్ద బాధ్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. అది వర్కింగ్ ప్రెసిడెంటా లేక ఎగ్జిక్యూటివ్ ప్రెసిడెంటా అనేది చంద్రబాబే నిర్ణయిస్తారు. మహానాడు భారీ సక్సెస్ అయింది. 20వేల మంది అనుకుంటే లక్షమంది వచ్చారు. కార్యకర్తలందరూ స్వచ్ఛందంగా తరలి వచ్చారు.



- జ్యోతుల నెహ్రూ, టీటీడీ బోర్డు సభ్యుడు, జగ్గంపేట ఎమ్మెల్యే





మహానాడులో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు నాయుడు

పసుపు జాతర



మహానాడు ప్రాంగణం వద్ద వాహనాల రద్దీ

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడపగడపలో టీడీపీ నిర్వహిస్తున్న మహానాడు జనజాతరను తలపిస్తోంది. రెండోరోజు బుధవారం సైతం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులతో సందడి నెలకొంది. వందల కిలోమీటర్ల నుంచి యువకులు సైకిళ్లపై వచ్చి టీడీపీపై తమ అభిమానం చాటుకున్నారు. యువతులు, మహిళలు పసుపుచీరలు, పచ్చ తలపాగాలతో సందడి చేశారు. దాదాపు లక్షమందికి భోజన ఏర్పాట్లు చేశారు. 'ఆహా ఏమి రుచి.. తినరా మైమరచి' అంటూ అందరూ భోజనాలను ఆస్వాదించారు. టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా పలువురు రక్తదానం చేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ 'యువగళం'పాదయాత్ర అనుభవాలతో తీసుకొచ్చిన 'వాయిస్ ఆఫ్ నారా లోకేశ్' పుస్తకాన్ని నారా చంద్రబాబు ఆవిష్కరించడంతో కార్యకర్తలు కేరింతలు కొట్టారు. కడప నగరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలు, వాహనాలతో కిటకిటలాడింది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- కడప ఆంధ్రజ్యోతి బృందం



అనంతపురం నుంచి సైకిల్ ర్యాలీగా వచ్చిన వారితో మహిళలు



మేము విజిలేస్తే..





ప్రతినిధుల నమోదు కేంద్రం వద్ద దేవినేని ఉమామహేశ్వర్‌రావుతో పెనగలూరు కార్యకర్తలు







వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు



వాయిస్ ఆఫ్ నారా లోకేశ్ పుస్తకాన్ని చూస్తున్న అచ్చెన్నాయుడు



వేదికపై ఎమ్మెల్యే ఆర్.మాధవి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి

మంత్రి సవిత ఆధ్వర్యంలో అనంతపురం నుంచి కడప మహానాడుకు సైకిళ్లపై వచ్చిన టీడీపీ కార్యకర్తలు





స్వర్గీయ ఎన్టీఆర్ ఆదర్శప్రాయుడు : కలెక్టర్

కడప కలెక్టరేట్, మే 28 (ఆంధ్రజ్యోతి): నందమూరి తారకరామారావు ప్రతిఒక్కరికీ ఆదర్శప్రాయుడని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ జయంతి సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ సమావేశ మందిరంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రామారావు జీవితం తెలుగు ప్రజలతో ముడిపడి ఉందని, ఆయన సినిమా రంగంలోనే కాకుండా అన్ని రంగాల్లో రాణించారన్నారు. ప్రజల వద్దకు పాలన, గ్రామ రెవెన్యూ వ్యవస్థ, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు, కిలో బియ్యం రూ.2 పథకం అమలు చేశారన్నారు. తెలుగు జాతి ఉన్నంత వరకు తెలుగు వారి గుండెల్లో ఎన్టీఆర్ చిరస్థాయిగా నిలుస్తారన్నారు. అనతికాలంలోనే ప్రభుత్వాన్ని స్థాపించి ముఖ్యమంత్రి అయిన ఘనత ఒక్క ఎన్టీఆర్‌కే సాధ్యమన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వరనాయుడు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ సరస్వతి, వ్యవసాయశాఖ జేడీ నాగేశ్వరరావు, డీసీఎంహెచ్ హిమదేవి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



మాజీ సీఎం ఎన్టీఆర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్ శ్రీధర్, జేసీ అదితిసింగ్ తదితరులు





మహా విందు

దళిత ద్రోహి జగన్

● మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి


సమావేశంలో మాట్లాడుతున్న మాదిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ శ్రీదేవి

కడప ఎన్టీఆర్ సర్కిల్, మే 28 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఐదేళ్లకాలంగా ఎస్సీ కార్పొరేషన్‌కు నిధులు ఇవ్వకుండా నిర్వీర్యం చేసిన దళిత ద్రోహి మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి అని మాదిగ కార్పొరేషన్ ఛైర్ పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి పేర్కొన్నారు. బుధవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్సీ యాక్షన్ ప్లాన్ కింద తీసుకోవాల్సిన చర్యల గురించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఎస్సీ రుణాల మంజూరుకు తక్కువ యూనిట్లు మంజూరు చేశారని.. దీని వల్ల గందరగోళ పరిస్థితి ఏర్పడిందని విలేకరులు ఆమె దృష్టికి తెచ్చారు. దీంతో ఆమె మాట్లాడుతూ కడప జిల్లాకు రూ.34 కోట్ల మేర రాయితీ రుణం అందిస్తున్నామన్నారు. 2014-19 వరకు చంద్ర బాబునాయుడు ఎస్సీల కోసం ఏం చేశారు, ఆ తరువాత ప్రభుత్వ పగ్గాలు చేపట్టిన జగన్‌మోహన్‌రెడ్డి ఏం చేశారనేది ఒకసారి గమనించాలన్నారు. చంద్ర బాబునాయుడు గత పాలనలో ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ, ఎన్ఎస్ఎ బీసీ ద్వారా రుణాలు మంజూరు చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ని రుణాలు మంజూరయ్యాయో అందరికీ తెలుసునన్నారు. రాష్ట్ర పరిస్థితులు ఎలా ఉన్నా బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రాయితీ రుణాలు అందించి ఆ వర్గాల ప్రజలకు స్వయం ఉపాధి ద్వారా జీవనోపాదులు కల్పిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎస్సీల కోసం పంపిణీ చేసేందుకు జిల్లాకు వచ్చిన ట్రాక్టర్లు, ఆటోలు తదితర వాహనాలు పంపిణీ చేయకపోవడంతో తుప్పు బట్టాయని.. వాటిని లబ్ధిదారులు తీసుకునే పరిస్థితి లేదనే విషయాన్ని విలేకరులు ఛైర్‌పర్సన్ దృష్టికి తెచ్చారు. చెడిపోయిన వాహనాలను పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయించి లబ్ధిదారులకు అందించే చర్యలు చేపడతామన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడి రాజ్యలక్ష్మి, మాదిగ కార్పొరేషన్ డైరెక్టరు దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

రాయచోటి స్పెషల్ బ్రాంచి సీఐకి ఊరట

● అభియోగాలపై ప్రభుత్వం క్లీన్ చిట్

కలికిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటి స్పెషల్ బ్రాంచి విభాగంలో ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్న ఎ.సత్యనారాయణకు పెద్ద ఊరట లభించింది. గతంలో ఆయనపై నమోదైన అభియోగాలన్నిటి నుంచి విముక్తి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎస్బీ సీఐ సత్యనారాయణ గతంలో మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసే కాలంలో 2023లో నమోదైన రెండు కేసుల్లో గంజాయికి సంబంధించిన విషయాలు నిరూపితమయ్యే విధంగా పకడ్బందీగా కేసును పటిష్టం చేయకుండా తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం వహించినట్లు ఉన్నతాధికారులు గుర్తించారు. అంతేగాకుండా నేరాల సంఖ్య కూడా బాగా పెరిగినట్లు పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కూడా విఫలమయ్యారని తెలిపారు. వీటన్నటిపై కర్నూలు డీఐజీ ఇచ్చిన నోటీసులపై సత్యనారాయణ చేసుకున్న విన్నపాన్ని, వివరణలను డీఐజీ తోసిపుచ్చారు. అంతేగాకుండా ఆయనకు ఏడాదిపాటు ఇంక్రిమెంటులో (పీపీఐ) కోత విధించారు. దీనిపైన సత్యనారాయణ మంగళగిరిలోని ఐజీకి అప్పీలు చేసుకున్నారు. అయితే ఐజీ కూడా 2024 అక్టోబరు 3న నేర నిర్ధారణ (సెన్స్యూర్) ఆదేశాలు జారీ చేశారు. అనంతరం సత్యనారాయణ దీని పైన ప్రభుత్వం వద్ద రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. అన్ని విషయాలు కూలంకుషంగా పరిశీలించిన ప్రభుత్వం ఐజీ ఇచ్చిన సెన్స్యూర్ ఉత్తర్వులతో పాటు ఇంక్రిమెంటులో కోత (పీపీఐ)ని కూడా రద్దు చేసింది. దీంతో సీఐ సత్యనారాయణకు పెద్ద ఊరట దక్కింది. ఈ మేరకు హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ రెండు వేర్వేరు జీవోలు జారీ చేశారు.

కడప ఆసుపత్రి పూర్వ సీఎస్ఆర్ఎంవోకు కూడా..

కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ (సీఎస్ఆర్ఎంవో)గా పనిచేస్తూ రిటైరయిన డాక్టర్ ఎ.రామారావుపై వచ్చిన అభియోగాలకు సంబంధించి కూడా ఆయనకు ప్రభుత్వం ఊరట కల్పించింది. రామారావు కృష్ణా జిల్లా కంకిపాడులో పనిచేసిన కాలంలో ఆయనపై నిధుల దుర్వినియోగం, బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం, వైఫల్యం వంటి ఆరోపణలు నమోదయ్యాయి. ఇవన్నీ విచారణ దశలో వుండగానే ఆయన కడప ఆసుపత్రిలో పనిచేస్తూ 2024లో రిటైరయ్యారు. అనంతరం ఆయన తనపై వచ్చిన ఆరోపణలను కొట్టేయాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టులో రామారావుకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దరిమిలా హైకోర్టు తీర్పును పరిశీలించిన ప్రభుత్వం ఆయనపై తదుపరి చర్యలను ఉపసంహరిస్తూ ఆరోగ్య, వైద్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డి హోస్మణి బుధవారం ఆదేశాలు జారీ చేశారు.

31న క్రికెట్ క్రీడాకారుల ఎంపికలు

కడప స్పోర్ట్స్, మే 28 (ఆంధ్రజ్యోతి): నగర రిమ్స్ సమీపంలోని వైయస్ఆర్ ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఈనెల 31వ తేదీ శనివారం ఉదయం 7-30 గంటలకు అండర్-19 పురుషుల క్రీడాకారుల ఎంపికలు జరుగనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. అలాగే జూన్ 1వ తేదీ ఆదివారం అండర్-19, అండర్-15 మహిళల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడా కారులు, క్రీడాకారిణీలు ఎంపికలకు హాజరు కావాలని కోరారు. ఎంపికలకు ఔత్సాహిక క్రీడాకారులు, క్రీడాకారిణిలు ఆధార్ కార్డు జిరాక్స్, బర్త్ సర్టిఫికెట్ (ఫారం-5), పాస్ పోర్ట్‌సైజ్ ఫొటో ఒరిజినల్‌తో పాటు ఒక సెట్టు జిరాక్స్, కిట్ బ్యాగ్‌లు కూడా తెచ్చుకోవాలని సూచించారు. పురుషులు తెలుపు కలర్ డ్రస్, కిట్ బ్యాగ్‌తో రావాలన్నారు.

టీడీపీ ఫ్లెక్సీలను, జెండాలను పీకేసిన వైసీపీ

● పార్నపల్లె, నల్లపురెడ్డిపల్లె కూడళ్లలో ఘటన


ఫ్లెక్సీని కూల్చిన వైసీపీ అభిమానులు

పులివెందుల, మే 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, జెండాలను వైసీపీ నాయకులు, కార్యకర్తలు జెండాలు పీకేసి ఫ్లెక్సీలను చింపేశారు. బుధవారం మధ్యాహ్నం సమయంలో వైసీపీకి చెందిన దాదాపు 15 మంది వ్యక్తులు పులివెందుల రింగురోడ్డులోని పార్నపల్లె కూడలిలో వైఎస్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జెండాలను పీకేశారు. అలాగే నల్లపురెడ్డిపల్లె కూడలి వద్దఫ్లెక్సీలను చించేసి వాటిని కిందపడేశారు. ఈవిషయం తెలుసుకున్న టీడీపీ కార్యకర్తలు, అభిమానులు వెంటనే పార్నపల్లె కూడలికి చేరుకొని జెండాలను మళ్లీ కట్టారు. వెంటనే కొందరు టీడీపీ కార్యకర్తలు


నల్లపురెడ్డిపల్లె కూడలి వద్ద పరిశీలిస్తున్న డీఎస్పీ

చింపిన వారు ఎవరైన సరే ఇక్కడకు రావాలని పిలిచారు. కానీ వైసీపీకి చెందిన వారు ఎవరు అక్కడకు వెళ్లలేదు. ఈవిషయం తెలుసుకున్న డీఎస్పీ మురళీ నాయక్, రూరల్ సీఐ రమణలు ఘటన స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. అప్పటికే అక్కడ టీడీపీకి చెందిన పలువురు అభిమానులు, కార్యకర్తలు ఉండడంతో జరిగిన విషయాన్ని వివరించారు. దీనిపై పోలీసులు విచారణ ప్రారంభించారు. కేసు నమోదు చేసి ఈచర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ తెలిపారు.

రాయలసీమ అభివృద్ధి గురించి... మహానాడులో ఒక్క మాట మాట్లాడలేదు

పులివెందుల రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ కడప జిల్లాలో ఏర్పాటు చేసిన మహానాడులో రాయలసీమ అభివృద్ధిపై ఒక్కమాట మాట్లాడలేదని కడప ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ మహానాడుపై రాష్ట్ర ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారన్నారు. మహానాడులో ఆత్మస్తుతి పరనింద తప్ప మరేదీ లేదన్నారు. వందల కోట్లు ఖర్చుచేసి భారీ సెట్టింగుల వేసి భజన చేసుకున్నారన్నారు. జగన్ జిల్లాలో మహానాడు అంటూ పైశాచిక ఆనందం పొందారన్నారు. బాబు ష్యూరిటీ బాబు గ్యారెంటీ అంటూ హామీలు ఇచ్చారని, వాటికి హ్యాండ్ ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలలో అసంతృప్తి మొదలైందన్నారు. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాల చుట్టూ తోరణాలు కట్టడం అభ్యంతకరరీతిలో జెండాలు ఏర్పాటు చేయడంతో ప్రజల మనోభావాలను దెబ్బతీశాయన్నారు. వైఎస్ విగ్రహాలకు టీడీపీ


మాట్లాడుతున్న ఎంపీ అవినాశ్‌రెడ్డి

తోరణాలు కట్టడం సభ్యత కాదన్నారు. వైఎస్ విగ్రహాల చుట్టూ కట్టిన తోరణాలు తొలగించాలని అధికారులకు తెలిపామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, మార్కెట్‌యార్డు మాజీ ఛైర్మన్ చిన్నప్ప, పట్టణ ఉపాధ్యక్షుడు పార్నపల్లె కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

తూకాల్లో తేడాలు వస్తే చర్యలు తప్పవు : డీఎస్‌వో

లక్కిరెడ్డిపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపు డీలర్లు ప్రజలకు అందిస్తున్న నిత్యావసర సరుకుల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తప్పవని డీఎస్‌వో రఘురాం పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లె మండలంలోని కొన్ని షాపులను ఆయన తనిఖీ చేశారు. అనంతరం అన్ని రేషన్‌షాపుల తూనికలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ జూన్ 1 నుంచి నిత్యావసర సరుకులు డీలర్ షాపు నుంచే లబ్ధిదారులు తీసుకెళ్లాలన్నారు. చౌకదుకాణ డీలర్ అందుబాటులో ఉండి సకాలంలో నిత్యావసర సరుకులను అందజేయాలన్నారు. కార్యక్రమంలో డీటీ రెడ్డెన్న, ఆర్ఐ రాజేశ్, డీలర్ రాజ్యలక్ష్మి, వీఆర్‌వో కృష్ణ, శివ తదితరులు పాల్గొన్నారు.

ముగ్గురు ఉపాధ్యాయుల సస్పెన్షన్

రాయచోటిటౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షా ప్రశ్న పత్రాల మూల్యాంకనంలో పొరపాట్లకు కారణమైన ముగ్గురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తూ బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ సుబ్రమణ్యం ఉత్తర్వులు జారీ చేశారు. పదవ తరగతి సాంఘీక శాస్త్రం ప్రశ్న పత్రం మార్కులు సరిగ్గా పొందుపర్చకుండా విద్యార్థికి నష్టం కలిగించే విధంగా వ్యవహరించిన చీఫ్ ఎగ్జామినర్, గుర్రకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు త్రినాధరావు, అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా వ్యవహరించిన రామసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మోహన్, స్పెషలిస్ట్‌గా వ్యవహరించిన రాయచోటి మోడల్ స్కూల్ వ్యాయామ ఉపాధ్యాయురాలు రేవతిలను సస్పెండ్ చేస్తూ డీఈవో ఉత్తర్వులు ఇచ్చారు.

మృతిచెందిన యువకుడి నేత్రాలు దానం


విష్ణువర్ధన్ (ఫైల్‌ఫొటో)

కొండాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి) మండలంలోని చౌటిపల్లె గ్రామానికి చెందిన విష్ణువర్దన్ (24) అనే యువకుడు బుధవారం ఎర్రగుంట్ల సమీపంలో రైలు కింద పడి మృతి చెందాడు. స్థానికంగా నివాసం ఉంటున్న రామసుబ్బయ్య కుమారుడైన ఇతను ఇంటర్ పూర్తిచేసి కంప్యూటర్ నేర్చుకుంటున్నాడు. విష్ణువర్దన్ అకాల మరణంతో తల్లిదండ్రులు బోరున విలపిస్తున్నారు. కాగా ఇతని నేత్రాలు మరొకరికి చూపు ఇవ్వాలని, కడప రిమ్స్‌లో నేత్రాలను దానం చేసి నట్లు అతని బంధువులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

● కాపాడిన పోలీసులు


బోటుసాయంతో మహిళను బయటికి తీసుకొస్తున్న సిబ్బంది

మైలవరం, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరుకు చెందిన 45 ఏళ్ల ఓ వివాహిత బుధవారం మైలవరం జలాశయంలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఆమెను కాపాడారు. పోలీసుల వివరాల మేరకు... ప్రొద్దుటూరు పట్టణం పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డుకు చెందిన వివాహిత భర్త పెరాలసిస్‌తో బాధపడుతుండడం, తన ఇద్దరు కుమారులు చనిపోవడంతో మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య చేసుకోవాలనే ఉద్దేశ్యంతో మైలవరంజలాశయం గేట్ల వద్ద దూకింది. ప్రాణభయంతో అక్కడే ఉన్న తాడును పట్టుకుని వేలాడుతూ కేకలు వేసింది. గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అప్రమత్తమైన పోలీసు సిబ్బంది జాలర్ల సహాయంతో ఆమెను కాపాడి ఒడ్డుకు చేర్చారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు తీసుకొచ్చి వారి బంధువులను పిలిపించి అప్పగించారు. మైలవరం జలాశయంలో దూకిన మహిళను వెంటనే స్పందించి కాపాడిన పోలీసులకు, జాలర్లకు స్థానికులు అభినందనలు తెలిపారు.

సన్నబియ్యానికి బోనస్ ఇచ్చి రైతులను ఆదుకోవాలి


మాట్లాడుతున్న కందుల మునిరెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న సన్న బియ్యానికి ప్రభుత్వం బోనస్ ప్రకటించి ఆదుకోవాలని జిల్లా రైస్‌మిల్లు అసోసియేషన్ అధ్యక్షుడు కందుల మునిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతంలో గత కొన్ని సంవత్సరాలుగా కష్టం మిల్లింగ్ రైస్ జరుగకపోవడం వలన సన్నబియ్యం సాగు చేస్తున్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే మద్దతు ధర గిట్టుబాటు కాక రైతులు తమ బియ్యాన్ని పక్క రాష్ట్రాల్లో విక్రయించుకుంటున్నారన్నారు. దీంతో రాయలసీమ ప్రాంతంలోని రైస్‌మిల్లుల్లో బియ్యం ఆడించడం పూర్తిగా తగ్గిపోయిందని...మిల్లుల్లో పనిచేసే కార్మికులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా బియ్యం సేకరణ విధానం తొలగించి కస్టం మిల్లింగ్ రైస్ విధానాన్ని అమలు చేయడంతో రైతులకు కష్టాలు ప్రారంభమయ్యాయన్నారు. దీంతో రాయలసీమ ప్రాంతంలో ఉన్న రైస్‌మిల్లులు నెలలో అయిదారు రోజులు మాత్రమే పనిచేస్తున్నాయని వివరించారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే రైస్‌మిల్లులను మూతవేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. 2015-16 ప్రాంతంలో రైస్ మిల్లుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొన్ని ఆదేశాలు జారీ చేసి ఆదుకున్నారని తెలిపారు. తమ ఇబ్బందులపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి దృష్టికి తీసుకెళ్లామని.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌లు దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో రైస్‌మిల్లు అసోసియేషన్ కోశాధికారి బి.వెంకటేశ్వర్లు, రైస్‌మిల్లుల యజమానులు వెంకటసుబ్బారెడ్డి, రవికుమార్‌రెడ్డి, జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీని నమ్ముకున్న కార్యకర్తలకు న్యాయం చేయాలి


● సెల్‌టవర్ ఎక్కి టీడీపీ నాయకురాలు హల్‌చల్

కడప క్రైం, మే 28 (ఆంధ్రజ్యోతి): 20 సంవత్సరాల నుంచి పార్టీ కోసం ఎంతో కష్టపడి పనిచేశామని, పార్టీ అధికారంలోకి వచ్చాక తమను దూరం పెట్టారని టీడీపీ నేత చిప్పగిరి మీనాక్షి బుధవారం ఆవేదన వ్యక్తం చేసింది. తాను గతంలో టీడీపీ మహిళా అధ్యక్షురాలిగా పార్టీ పిలుపునిస్తే ఎన్నో ధర్నాలు, రాస్తారోకోలు చేయడంతో పాటు కేసులు ఎదుర్కొన్నామని... తమకు న్యాయం చేయాలంటూ ఎన్టీఆర్ విగ్రహానికి బుధవారం ఆమె వినతిపత్రం ఇచ్చారు. అనంతరం ఎన్టీఆర్‌సర్కిల్ వద్ద ఉన్న సెల్‌టవర్ పైకి ఎక్కి నిరసన వ్యక్తం చేస్తూ.. ఆత్మహత్యాయత్నం చేసింది. దాదాపు రెండుగంటల పాటు ఈమె సెల్‌టవర్ ఎక్కి హల్‌చల్ చేసింది. కాగా, ఆమె వినతి ప్రతంలో పేర్కొన్న వివరాలిలా... 2024లో కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి గెలిచినప్పటి నుంచి వందలాది మంది కార్యకర్తలను పట్టించుకోవడం లేదని.. దళిత వర్గాలను పార్టీకి దూరం చేసే కుట్ర చేస్తుందని ఆరోపించారు. 20 ఏళ్ల పాటు పార్టీలో పనిచేస్తే తమకు కనీసం మహానాడుకు పిలుపు రాలేదని ఆమె ఫిర్యాదులో పేర్కొంది. పార్టీ పెద్దలు పట్టించుకోకపోతే భవిష్యత్తులో కడపలో పార్టీ ఉనికికే ప్రమాదం అన్నారు. ఇప్పటికైనా పార్టీ కోసం కష్టపడిన తమ లాంటి వారిని గుర్తించి న్యాయం చేయాలని కోరారు. దాదాపు రెండు గంటల పాటు ఆమె సెల్‌టవర్ ఎక్కి పైనే కూర్చుంది. విషయం తెలుసుకున్న వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ, ఎస్ఐలు అమర్‌నాధరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కడప తహసీల్దారు, కడప ఫైర్ అధికారి బస్విరెడ్డి అక్కడికి


సెల్‌టవర్ నుంచి మీనాక్షిని సురక్షితంగా దించుతున్నఫైర్ సిబ్బంది

చేరుకున్నారు. ఆమెకు మైకు ద్వారా నచ్చచెప్పే ప్రయత్నం చేశారు. అటు ఆమె భర్త, కుమార్తె, మరికొందరు ఆమె టవరు నుంచి దిగాలని వేడుకున్నా ఆమె మహానాడులో తమ గోడును వినిపించే అవకాశం కల్పిం చాలని డిమాండ్ చేసింది. చివరికి వన్‌టౌన్ సీఐ రామక్రిష్ణ మంత్రి లోకేశ్‌తో మాట్లాడించే అవకాశం కల్పిస్తామని నచ్చజెప్పారు. దీంతో ఆమె కిందకు దిగే ప్రయత్నం చేస్తుం డగా కడపఫైర్ అధికారులు సెల్‌టవర్ ఎక్కి ఆమెను సురక్షి తంగా కిందికు దించి 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు.

రెచ్చగొడితే తీవ్ర పరిణామాలు.. బీటెక్ రవి


మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, మే 28 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉన్న పులివెందుల వాతావరణాన్ని పాడు చేయొద్దని... రెచ్చగొడితే తీవ్రపరిణామాలు చవి చూడాల్సి వస్తుందని పులివెందుల నియోజ కవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్ర నాథ రెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. పులివెందులలో పార్న్ పల్లె, నల్లపురెడ్డిపల్లె రింగురోడ్డు కూడలిలో టీడీపీ జెండాలను, ఫ్లెక్సీలను వైసీపీ కార్యకర్తలు చించేసిన విషయమై బీటెక్ రవి ఈ మేరకు ఒక వీడియో విడుదల చేశారు. ఇందులో పులివెందులలో అనేక చోట్ల వైఎస్ విగ్రహాలను ఏర్పాటు చేశారన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా కడపలో జరుగుతున్న మహానాడు కార్యక్రమానికి అనంతపురం జిల్లా నుంచి వస్తున్న వారికి భోజనాల ఏర్పాటు తదతర కార్యక్రమాలు చేపట్టామన్నారు. ఇందులో భాగంగా నాలుగు చోట్ల వైఎస్ విగ్రహాలకు తగలకుండా జెండాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ జెండాలను బుధవారం మధ్యాహ్నం దాదాపు 15 మంది జెండాలు పీకేసి, ఫ్లెక్సీలు చించేసి కాళ్లతో తొక్కడం చేశారన్నారు. ఇలా చేయడం ఎంత వరకు సబబు అని పులివెందుల ప్రజలు ఆలోచించాలన్నారు. ఊరికే ఉంటే రెచ్చగొట్టేవి చేయొద్దన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పనులు చేస్తే చర్యలు తప్పవన్నారు. ఇప్పటి వరకు కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదన్నారు. మా గ్రామంలో మా చిన్నాన్నను చంపిన వారితో కూడా మేము కలిసి ఉన్నామన్నారు. జెండాలు పీకిన విషయమై తీవ్రంగా హెచ్చరిస్తున్నా అన్నారు. మీకు నిజంగా పౌరుషం, చీము నెత్తురు వైఎస్‌పై అభిమానం ఉంటే వైఎస్ తమ్ముడు వివేకానందరెడ్డిని చంపారనే అభియోగాలు ఎదుర్కొంటున్న వారిని చొక్కాపట్టుకొని నిలదీయాలన్నారు. వైఎస్ అంటే మీకంటే మాకే అభిమానం ఎక్కువ అన్నారు. ప్రశాంతంగా ఉన్న వాతావరణాన్ని పాడు చేయొద్దన్నారు.

'తెలుగువారి ఆత్మగౌరవాన్ని చాటిన ఎన్టీఆర్'


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌వో మధుసూదన్‌రావు

రాయచోటి(కలెక్టరేట్), మే 28 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన వ్యక్తి స్వర్గీయ నందమూరి తారకరామారావు అని, ఆయనకు భారతరత్న ఇవ్వడం తెలుగు వారందరినీ గౌరవించడమేనని జిల్లా డీఆర్‌వో మధుసూదన్‌రావు పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాల్‌లో ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు తెలుగువారిని గుర్తించేవారు లేరని.. మనల్ని మద్రాసీలని పిలిచేవారని, ఆ దశ నుంచి తెలుగు వారందరికీ గౌరవాన్ని తెచ్చిన వ్యక్తి రామారావు అన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి శివప్రకాశ్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీపీఎస్సీ ద్వారా అత్యంత పారదర్శకంగా ఆ నియామకాలు జరగడం ఎన్టీఆర్ వల్లనే సాధ్యమైందన్నారు. సమావేశంలో రాయచోటి తహసీల్దార్ నరసింహకుమార్ కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో....


ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న డీఎస్పీ కృష్ణమోహన్

స్వర్గీయ నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను బుధవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాయచోటి డీఎస్పీ ఎంఆర్ కృష్ణమోహన్ ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన మహనీయుడు రామారావు అన్నారు. ఎన్టీఆర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని శాంతిభద్రతల పరిరక్షణకు, సమాజ శ్రేయస్సుకు మనమంతా కట్టుబడి ఉండాలన్నారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ పెద్దయ్య, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసులు తదితరులు పాల్గొన్నారు

డ్వామా అదనపు పీడీ స్వచ్ఛంద పదవీ విరమణ

కలికిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): కడప జిల్లా డ్వామా అద నపు ప్రాజెక్ట్ డైరెక్టరు సి.నాగరత్నమ్మ స్వచ్ఛంద పదవీ విరమణకు అనుమతిస్తూ ప్రభుత్వం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. డీఎల్‌డీవోగా వున్న నాగరత్నమ్మ ప్రస్తుతం డెప్యుటేషన్‌పై డ్వామా ఏపీడీగా పనిచేస్తున్నారు. వ్యక్తిగత కారణాల రీత్యా మే 31 తేదీ నాటికి తన స్వచ్ఛంద పదవీ విరమణ కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేశారు. ఆమె దరఖాస్తును పరిశీలించిన ప్రభుత్వం పదవీ విరమణ చేయడానికి అనుమతిస్తూ పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ కుమార్ బుధ వారం ఆదేశాలు జారీ చేశారు.

యుగపురుషుడు ఎన్టీఆర్

● రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి







రాయచోటి: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న గాజుల ఖాదర్‌బాషా.. రాయచోటి: నివాళులర్పిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు.. రైల్వేకోడూరు: ఎన్టీఆర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ముక్కా రూపానందరెడ్డి

రాజంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో సంక్షేమానికి బాటలు వేసిన మహానేత స్వర్గీయ నందమూరి తారక రామారావు అని పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు పేర్కొన్నారు. బుధవారం తెలుగు దేశం పార్టీ వ్యవస్థాపకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు 102 జయంతిని రాజంపేటలో టీడీపీ నేతలు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బైపాస్‌లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అతి తక్కువ కాలంలో పార్టీ పెట్టి రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన చరిత్ర ఆయనకే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో పేద, బడుగు, బలహీనవర్గాలు అభ్యున్నతి కోసం ఎన్నో పథకాలు, సంస్కరణలను తీసుకువచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

సుగవాసి భవన్‌లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి

రాయచోటిటౌన్, మే28(ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల సుగవాసి భవన్‌లో బుధవారం యుగపురుషుడు నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు, టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉమ్మడి కడప జిల్లాలో నందమూరి తారక రామారావుతో కలిసి పనిచేసిన వారిని గుర్తు చేసుకుంటే మొదటగా మనకు గుర్తుకు వచ్చే పేరు స్వర్గీయ సుగవాసి పాలకొండ్రాయుడు అన్నారు. తెలుగుదేశం పార్టీలో మరణించేవరకు 30 సంవత్సరాల పాటు ఎమ్మెల్యేగా, ఎంపీగా విజయ ఢంకా మోగించారన్నారు. 1984 సంవత్సరంలోనే పాలకొండ్రాయుడి నీతి, నిజాయితీకి నందమూరి తారకరామారావు అభినందించారన్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ మైనార్టీ నాయకులు రసూల్‌ఖాన్, గౌస్‌పీర్, గౌస్‌అలీ, మయానా ఇర్షాద్‌అలీఖాన్, మర్యాపురం వెంకటేశ్వర్లు (చిట్టి), సుగవాసి శ్రీనివాసులు, మన్నేరు రామాంజనేయులు, తదితర మైనార్టీ నేతలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అడుగుజాడల్లో నడుద్దాం: ముక్కా

రైల్వేకోడూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అడుగుజాడల్లో నడుద్దాం అని టీడీపీ రైల్వేకోడూరు ఇన్‌చార్జ్, కుడా చైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, యువ నేత ముక్కా సాయివికాస్‌రెడ్డి అన్నారు. ఎన్టీఆర్ జయంతి సందర్భంగా రాజంపేట పట్టణంలోని ఆయన విగ్రహం వద్ద నివాళులర్పించిన అనంతరం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మహిళా నాయకురాలు ముక్కా వరలక్ష్మీ, కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు

దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు అన్నారు. బుధవారం రైల్వేకోడూరులో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమావేసి నివాళుల ర్పించారు.

సుండుపల్లె: తెలుగు జాతి గర్వించదగ్గ వ్యక్తి స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు అని టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్ప తెలిపారు. గురువారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు సురేశ్‌నాయుడు, మాజీ ఎంపీటీసీ మోహన్‌బాబునాయుడు, ఐటీడీపీ మండల అధ్యక్షుడు ఎల్‌వీ రమణ, తిమ్మసముద్రం గ్రామ అధ్యక్షుడు శివరాం, స్కూల్ కమిటీ చైర్మన్ ఓబులేసు, మైనార్టీ నాయకులు ఇస్మాయిల్ పాల్గొన్నారు.

చిన్నమండెం: చిన్నమండెం మండల తెలుగు యువత అధ్యక్షుడు తౌహిద్‌ఖాన్ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ఘాట్ వద్ద నివాళులర్పించారు. సమాజమే దేవాలయం ప్రజలే దేవుళ్లు అనే నినాదంతో ముఖ్యమంత్రిగా ఎన్నో సంస్కరణలు చేసిన నందమూరి తారకరామారావుకు నివాళులు అర్పించడంతో తన జన్మ ధన్యమైందన్నారు.

రాయచోటిటౌన్: బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా ముందుకెళ్లిన మహనీయుడు స్వర్గీయ నందమూరి తారకరామారావు అని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా పేర్కొన్నారు. ఎన్టీఆర్ జయంతిని రాయచోటి మండల పరిధిలోని దిగువ అబ్బవరం గ్రామంలో ఘనంగా నిర్వహించారు. రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, ఆంజనేయులునాయుడు, మండల కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, టీడీపీ నేతలు అబ్దుల్‌రౌఫా, ఎస్ఎండీ రఫి, అమీర్‌బాషా, హైదర్, రియాజ్, టీడీపీ కార్యకర్తలు, అభిమానులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు రూరల్: రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్ చాంద్ ఎన్టీఆర్‌కు ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి ఎన్టీఆర్‌కు నివాళి అర్పించారు.

పెనగలూరు: దివంగత నందమూరి తారకరామారావు జయంతి, అలాగే టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడి జన్మదినం ఒకేరోజు కావడంతో మండలంలోని ఆ పార్టీ నాయకులు బుధవారం ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. విశ్వనాథనాయుడి అనుచరులు రైల్వేకోడూరులో ఆయన కార్యాలయానికి వెళ్లి ఎన్టీఆర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విశ్వనాథనాయుడికి శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు. మండల సీనియర్ నాయకులు మల్లయ్య, పుచ్చకాయల కిష్టయ్య, కోలా మురళి, ఎస్.రాంప్రసాద్‌నాయుడు, ఎస్.షామిని, పి.రవికుమార్, పి.సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ఒంటిమిట్ట : ఎన్టీఆర్ జయంతి వేడుకలను ఎంపీడీవో కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం ఎంపీడీవో గౌస్‌బాషా ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శులు సుధాకర్, కృపాకర్, శివకుమార్, చంద్ర, సిబ్బంది దీపక్ తదితరులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లె: తెలుగుజాతి గర్వించదగ్గ మహనీయుడు ఎన్టీఆర్ అని జిల్లా పౌరసరఫరాల అధికారి రఘురాం, మండల తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకుని స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డీటీ రెడ్డెన్న, శివప్రసాద్, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేశ్, వీఆర్‌వోలు కృష్ణ, పుష్పరాజ్, వెంకోజి, సిబ్బంది పాల్గొన్నారు.

సంబేపల్లె: అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఎన్టీఆర్ జయంతి నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ నరసారెడ్డి, మాజీ సర్పంచులు గోపాల్, శశిధర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు చిన్నరెడ్డెయ్యయాదవ్,నాయకులు పాల్గొన్నారు.

యుగ పురుషుడు ఎన్టీఆర్

రాజంపేట టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలోని వైబీఎన్‌పల్లె గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, నంద్యాల జిల్లా ఇన్‌చార్జి పోతుగుంట రమేష్‌నాయుడు ఎన్టీఆర్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. టీడీపీ నాయకులు ముళ్లగూరి సుబ్రమణ్యంనాయుడు,బాసినేని రెడ్డయ్యనాయుడు, గొల్లపూడి సుబ్రమణ్యం, బీజేపీ ఓబీసీ మోర్చ రాష్ట్ర అధికార ప్రతినిధి పట్టుపోగుల ఆదినారాయణ పాల్గొన్నారు.

తృటిలో తప్పిన ప్రమాదం

రైల్వేకోడూరు, మే 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని శాంతినగర్ వద్ద బుధవారం తెల్లవారుజామున ఓ కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్‌కు చెందిన కొందరు రెండు కార్లలో తిరుమల దైవ దర్శనం కోసం వెళ్లి అనంతరం మంగళవారం రాత్రి స్వస్థలానికి బయలుదేరారు. బుధవారం తెల్లవారుజామున రైల్వేకోడూరు మండలంలోని శాంతినగర్ వద్ద ఆ రెండు కార్లలో ఓ కారు అదుపు తప్పి విద్యుత్ స్తంభాని ఢీకొట్టింది. స్తంభం విరిగి కారుపై పడింది. విద్యుత్ స్తంభం పక్కనే ఓ స్కూటీని నిలిపి ఉండగా అది కారు కింద పడి నలిగిపోయింది. విద్యుత్ తీగలు కారుపై పడి ఉంటే కారు మొత్తం కాలిపోయేదని శాంతినగర్ గ్రామస్థులు తెలిపారు. కారులో ఉన్న ఆరుగురికి ఎలాంటి ప్రమాదం లేకుండా భయటపడడంతో ఊపిరిపీల్చుకున్నారు.

రోగులకు మెరుగైన సేవలు

సిద్దవటం, మే 28 (ఆంధ్రజ్యోతి) : రోగులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ప్రకాష్ అన్నారు. సిద్దవటం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో బుధవారం ఎంపీపీ జ్యోతి వెంకటమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రకాష్ మాట్లాడుతూ సిద్దవటం 30 పడకల ప్రభుత్వ వైద్యశాలలో 8 మంది వైద్యులు, ఐదుగురు స్టాఫ్ నర్సులు, ఇతర వైద్య సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉంటూ రోగులకు వైద్య చికిత్సలు అందిస్తున్నారన్నారు. అయితే ఆపరేషన్ థియేటర్‌లో ఓటీ టేబుల్ లేక ఆపరేషన్లను రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నామన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 15 ఫైనాన్స్ నిధుల కింద ఏ గ్రామానికి ఎంత నిధులతో రోడ్డు పనులు మంజూరు చేశారో తెలపాలని ఎంపీటీసీ సభ్యులు సభ దృష్టికి తీసుకెళ్లారు. ఎంపీటీసీ సభ్యుడు శివయ్య మాట్లాడుతూ కొంతమందికి డ్వాక్రా గ్రూపు సభ్యులు డబ్బు వసూలు చేస్తున్నారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

సిద్దవటం, మే 28 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం- బద్వేల్ ప్రధాన రహదారి సాహెబ్ బావి అటవీ ప్రాంతంలో కారు కల్వర్టును ఢీకొన్న ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. వా రిని 108 వాహనంలో కడప రిమ్స్‌కు తరలించారు. ఎస్ఐ మహమ్మద్ రఫి వివరాల మేరకు... రాష్ట్ర వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి డాక్టర్ శ్యాంప్రసాద్, పీవీ రమణయ్య కడప ప్రెస్‌క్లబ్‌లో జరిగే సమావేశానికి ఉదయగిరి నుంచి కారులో బయలుదేరారు. కారు అతివేగంగా వచ్చి కల్వర్టును ఢీకొంది. దీంతో వారిద్దరికీ గాయాలు తగలడంతో కడప రిమ్స్‌కు తరలించారు. ఈ మేరకు విచారిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు మాతాంగ మహాపీఠం భూమిపూజ

● ఏర్పాట్లను పరిశీలించిన రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ

లక్కిరెడ్డిపల్లె, మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్కిరెడ్డిపల్లె పంచాయతీలోని దొరిచెరువు సమీపంలో మాతాంగ మహాపీఠం భూపతి కార్యక్రమం గురువారం నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ, కర్ణాటక మంత్రులతో పాటు రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పాల్గొంటారని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాతాంగ పీఠ ధర్మాధికారి డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం హోమం కార్యక్రమాలు ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమం 108 హోమాలతో ఇద్దరిద్దరు దంపతులు పాల్గొని పూజలు నిర్వహిస్తారని, మాతాంగ నందగిరి స్వామిజీ పాల్గొంటారని తెలిపారు. రాయచోటి డీఎస్పీ కృష్ణమోహన్, సీఐ కొండారెడ్డి, రామాపురం, లక్కిరెడ్డిపల్లె, గాలివీడు ఎస్ఐలు పాల్గొని ఏర్పాట్లను పరిశీలించారు. ఆర్డీవో శ్రీనివాసులు, లక్కిరెడ్డిపల్లె ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో ఉషారాణి, డీటీలు నరసింహులు, రెడ్డెన్న, మాతాంగ పీఠం కమిటీ సభ్యులు వెంకట్రమణ(గురుస్వామి), కృష్ణ, విశ్వనాథ, సిద్దయ్య, సర్పంచ్ జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాతాంగ పీఠం అభివృద్ధికి సహకారం

మాతాంగ పీఠం అభివృద్ధికి తమ వంతు సాయం అందిస్తామని కర్ణాటలక రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి మునియప్ప పేర్కొన్నారు. బుధవారం లక్కిరెడ్డిపల్లెలోని శ్రీమాతాంగ నందగిరి స్వామిజీని ఆయన దర్శించుకుని ఆశీస్సులు పొందారు.

రెడ్డిపల్లెలో టీడీపీ కార్యాలయం ప్రారంభం

పుల్లంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : రెడ్డిపల్లె ఆర్ఎస్ వద్ద మంగళవారం తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కస్తూరి జన్మదిన వేడుకలను నూతన పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు కేక్ కట్‌చేసి కస్తూరిని సన్మానించారు. మాజీ మంత్రి పరసా రత్నం పారిశ్రామికవేత్త విశ్వేశ్వరనాయుడు, సర్పంచ్ జయరామక్రిష్టారెడ్డి, వడ్డెపల్లె రవి, విశ్రాంత లెక్చరర్ అజయ్‌బాబు, నాయుడోరి రమణ, కొండేటి రమణ పాల్గొన్నారు.

బాక్సింగ్‌లో బంగారు పతకం

రాజంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో రాజంపేటకు చెందిన ఫైజాన్ పాల్గొని బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఫైజాన్ మాట్లాడుతూ స్పాన్సర్‌షిప్ ఉంటే ఇండియాకు ఆడాలని ఉందన్నారు. కాగా ఫైజాన్ బంగారు పతకం సాధించడంతో తోటి మిత్రులు, బంధువులు, కుటుంబ సభ్యులు అభినందనలు తెలియజేశారు.


'మహా'దండు

మహానాడుతో కడప గడప గడపా వెలుగు రేఖలు సంతరించుకుంది. కడప నగరం పసుపుమయంగా మారింది. ఎటు చూసిన జనహోరుతో టీడీపీ జోరు కనిపించింది. పార్టీ శ్రేణులే కాకుండా ప్రజలు సైతం కదిలి రావడంతో మహానాడు జనసంద్రంగా మారింది.





కడప నగరంలో నిర్వహించిన మహానాడులో పాల్గొన్న గాలివీడు, నందలూరు టీడీపీ నాయకులు





మహానాడులో లేబాక శ్రీనివాసరెడ్డి, పాలిరెడ్డి.. ఎమ్మెల్యే చింతమనేనిని కలసిన కోడూరు మైనార్టీ నాయకులు



ఒంటిమిట్ట నుంచి మహానాడుకు చేరుకున్న టీడీపీ నేతలు

ఉప్పరపల్లెలో భోజన సౌకర్యం

ఒంటిమిట్ట/సిద్దవటం, మే 28 (ఆంధ్రజ్యోతి): మహానాడుకు వెళ్లే వారికి ఉప్పరపల్లెలో భోజన సౌకర్యం ఏర్పాటు చేసినట్లు టీడీపీ మండల అధ్యక్షుడు నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శి బొబ్బిలి రాయుడు, పార్టీ సీనియర్ నాయకులు ఎస్వీ రమణ తెలిపారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో సుమారు 60 వేల మందికి గురువారం మధ్యాహ్నం భోజన వసతి కల్పిస్తున్నట్లు వారు తెలిపారు.

భోజన ఏర్పాట్ల పరిశీలన

రామాపురం, మే28(ఆంధ్రజ్యోతి): కడపలో నిర్వహించే మహానాడు సందర్భంగా రాయచోటి మీదుగా వచ్చే టీడీపీ నాయకులు, కార్యకర్తలు గువ్వల చెరువు వద్ద భోజన ఏర్పాట్లను టీడీపీ నాయకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి, మౌర్యారెడ్డి, నిశ్చల్‌నాగిరెడ్డి బుధవారం పరిశీలించారు. ప్రతి ఒక్కరూ గువ్వల చెరువులో భోజనం చేసి మహానాడు కార్యక్రమానికి హాజరుకావాలన్నారు.

నేటి నుంచి రేణుక యల్లమ్మ జాతర

గాలివీడు, మే28(ఆంధ్రజ్యోతి): నూలివీడు పంచాయతీ నాగూరువాండ్లపల్లెకు సమీపంలో వెలిసిన రేణుక యల్లమ్మ జాతర నేటి నుంచి జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. జాతరకు చుట్టుపక్కల గ్రామలతో పాటు మండల ప్రజలు అత్యధికంగా తరలిరానున్నట్లు వారు పేర్కొన్నారు.

నేటి నుంచి అంజన్న విగ్రహ ప్రతిష్ఠ

రామాపురం, మే28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరపల్లి పంచాయతీ సూరకవాండ్లపల్లె సబ్‌స్టేషన్ సమీపంలో ఉన్న శ్రీఆంజనేయస్వామి ఆలయంలో ఈ నెల 29 గురువారం నుంచి ఆదివారం వరకు మూడు రోజుల పాటుపూజా కార్యక్రమం అనంతరం విగ్రహ ప్రతిష్ఠ నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహకులు తెలిపారు.

సినిమాహాళ్ల పరిశీలన



సినిమాహాలు లోపల పరిశీలిస్తున్న తహసీల్దార్ మహబూబ్‌చాంద్

రైల్వేకోడూరు రూరల్, 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సినిమాహాళ్లను బుధవారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సినిమాహాల్‌లోనూ పరిశుభ్రత, తినుబండారాలు, మరుగదొడ్లు పరిశీలిస్తున్నామన్నారు. ఏవైనా లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు. గుడువు ముగిసిన తినుబండారాలను ఉంచరాదన్నారు. సినిమా టిక్కెట్ల ధరలను పరిశీలించారు.

ఎస్ఐకి సన్మానం

రైల్వేకోడూరు, మే 28(ఆంధ్రజ్యోతి): కోడూరు ఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన వీఎల్ ప్రసాద్‌రెడ్డిని బీజేపీ నాయకులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో సాయం శ్రీధర్, కాశప్పగారి రాము, కుప్పాల కిరణ్, సీనియర్ నాయకులు వాకచర్ల సుబ్బారావు, సుమంత్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నేడు గంగమ్మ జాతర

పెనగలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లపురెడ్డిపల్లెలో గురువారం గంగమ్మతల్లి జాతర జరుగుతుందని గ్రామ పెద్దలు తెలిపారు. నల్లపురెడ్డిపల్లె గ్రామ పరిధిలో ఎగువ, దిగువ ఊరు గ్రామ ప్రజలు జాతరను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పిల్లల తల్లిదండ్రులకు ఎస్ఐ కౌన్సెలింగ్



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ మల్లికార్జునరెడ్డి

నందలూరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు ఉత్తర్వుల మేరకు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి బుధవారం మైనర్ పిల్లల తల్లిదండ్రులను పోలీసుస్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని తెలిపారు.మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు.

టైప్ రైటింగ్‌తో ఉద్యోగావకాశాలు

ఓబులవారిపల్లె, మే 28 (ఆంధ్రజ్యోతి) : సాంకేతిక విద్యకు తొలిమెట్టు టైప్ రైటింగ్ అని, టైప్ రైటింగ్‌తో ఉద్యోగాలు పొందొచ్చని తహసీల్దారు శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం చిన్నఓరంపాడు క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేసిన రమణ టైపు రైటింగ్ ఇన్‌స్టిట్యూట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టైపింగ్ స్కిల్స్ ఉన్నవారికి ప్రభుత్వరంగ సంస్థలు, కోర్టు ఉద్యోగాల్లో టైపిస్టు పోస్టులకు అర్హత ఉంటుందన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలు

రాయచోటిటౌన్, మే28(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు విలీనం అయ్యి ఆంధ్రప్రదేశ్ బ్యాంక్‌గా మారినా ఖాతాదారులకు మాత్రం మెరుగైన సేవలు అందిస్తామని ఆంధ్రప్రదేశ్ బ్యాంక్ రాయచోటి బ్రాంచ్ మేనేజర్ సదాశివరెడ్డి అన్నారు. బుధవారం ఓదివీడు గ్రామంలో ఖాతాదారులకు బ్యాంక్ సేవలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రుణాలు తక్కువ వడ్డీకే ఇస్తామన్నారు.

ఎంపీటీసీలకు వేతనాలు మంజూరు

ఒంటిమిట్ట, మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎంపీటీసీ సభ్యులు వేతనాలు మంజూరైనట్లు ఎంపీడీవో గౌస్‌బాషా తెలిపారు. నాలుగు విడతలుగా రూ.4,09,057 మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ వేతనాలను త్వరలోనే అందజేస్తామన్నారు.


పీలేరులో ఎన్టీఆర్‌కు నివాళులు అర్పిస్తున్న టీడీపీ శ్రేణులు


తంబళ్లపల్లె: జెండా ఆవిష్కరిస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు


వాల్మీకిపురం: నివాళులర్పిస్తున్న నాయకులు

తెలుగు జాతి కీర్తి పతాక ఎన్‌టీఆర్

● వాడవాడలా ఘనంగా ఎన్టీఆర్ జయంతి

మదనపల్లెటౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): టీడీపీ స్థాపించిన అనతి కాలంలోనే అధికారంలోకి వచ్చి సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత ఎన్‌టీరామారావుదే అని ఎమ్మెల్యే షాజహాన్ బాషా తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ 102వ జయంతి సందర్భంగా మదనపల్లెలో పలుచోట్ల ఎన్టీఆర్ విగ్రహాలు, చిత్రపటాలకు నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేసి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిలో రూ.2కే బియ్యం పంపిణీ చేసి ఎన్టీఆర్ పేదల ఆకలి తీర్చార న్నారు. ఆయన అడుగుజాడల్లో సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా పాలన అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్‌బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, ఎస్‌ఏ మస్తాన్, నాదెళ్ల శివన్న, పఠాన్ ఖాదర్ ఖాన్, సుధాకర్, ఓ.వెంకటేష్, ఎర్రబల్లి వెంకట రమణారెడ్డి, నవీన్, తదితరులు పాల్గొన్నారు. నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేష్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో, తట్టివారిపల్లె గ్రామ సచివాలయంలో నివాళులర్పించారు. పంచాయతీ కార్యదర్శి రవి, ఉత్తమరెడ్డి, లక్ష్మీపతి, బీవీ రమణ, చెన్నప్ప, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎన్టీఆర్ చిత్రపటాన్ని ఆవిష్కరించి, పూలమాలలతో నివాళులర్పించారు. అనంతరం ఆసుపత్రిలోని రోగులు, వారి సహాయకులకు పాలు, పండు, బ్రెడ్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పురం రామ్మూర్తి, నాయకులు లడ్డూజాఫర్, పోలిశెట్టి సురేంద్ర, యల్లెల రెడ్డప్ప రెడ్డి, షౌకత్ అలీ, చాన్‌బాషా, ఫైరోజ్, సుబ్బయ్య, ఖాజాపీర్, రహంతుల్లా, షమ, వెంకటరమణ నాయక్, వసంతాల రాజా, ఎన్టీఆర్ నఫీస్, మహమ్మద్ పీర్, జయన్న, హనీఫ్, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండ: ఎంపీడీవో కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. తెలుగు ప్రజల కోసం ఎన్టీఆర్ చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

నిమ్మనపలి : స్థానిక బస్టాండులో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బాణసంచా పేల్చి, ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పించి కేకు కట్ చేశారు. అనంతరం మండల అధ్యక్షుడు వెంకటరమణ మాట్లాడుతూ ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన పలు పథకాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిపోయాయని తెలిపారు. మహిళలకు ఆస్తిలో సమాన వాటాను కల్పించిన ఘనత ఆయదే అన్నారు. కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లిలో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించి స్వీట్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో నాయకులు వసంతమునిరత్నం, దేవేంద్ర, ఆర్‌జే, కృష్ణయ్య, రామకృష్ణ, రెడ్డెప్ప, రమణ పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రం: బస్టాండు కూడలిలో ఎన్టీఆర్ చిత్రపటానికి కూటమి నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ తెలుగు ప్రజల ఆత్మ గౌరవాన్ని దశ దిశలా వ్యాపింప చేసి ప్రజల గుండెల్లో ఆయన చిరస్థాయిగా నిలిచి పోయాడన్నారు. ఆ మహనీయుని అడుగుజాడల్లో పయనిం చాలన్నారు.

తంబళ్లపల్లె: స్థానిక ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించి నివాళులు అర్పించారు. మండల టీడీపీ అధ్యక్షుడు రెడ్డప్పరెడ్డి, ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి నాయుడు, రాష్ట్ర బీసీ నాయకుడు తులసీధర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జి బేరిశీన, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామచంద్ర, పురుషోత్తం, ఎస్‌ఎంసీ చైర్మన్ వీరాంజినేయులు, కాలా నారాయణ సుధాకర్‌రెడ్డి, తెలుగు యువత నరసింహులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురం : స్థానిక వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ఎన్‌టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నిరుపేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ముఖద్వారం వద్ద స్థానిక నాయకులు మొర్రంరెడ్డి రామ్‌కుమార్‌రెడ్డి ఎన్‌టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి,


మదనపల్లెలో ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, టీడీపీ నాయకులు

రాజేంద్రాచారి, కోసూరి చంద్రమౌళి, పీవీ నారాయణ, మురళి, బొక్కసం బ్రదర్స్, శేషాద్రిరెడ్డి, రాజగోపాల్ , కేకేనాయుడు, ఆదినారాయణ, తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలికిరి : టీడీపీ వ్యవస్థాపకులు, మాజీ సీఎం ఎన్టీ రామారావు జయంతి వేడుకలను బుధవారం మండలంలో మొదటిసారి అధికారికంగా నిర్వహించారు. మండల పరిషత్తు కార్యాలయంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీవో మహ్మద్ రియాజుద్దీన్, ఏవో సురేంద్రబాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్టీఆర్ చిత్రపటం ముందు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వెంకటేశ్వర రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామసముద్రం : మండల కేంద్రంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి కార్యకర్తలకు, అభిమా నులకు పంచారు. టీడీపీ అధ్యక్షుడు విజయకుమార్‌గౌడు, హోటల్ నారాయణస్వామి, గణేష్, పూజారి గంప్ప, షమ్ము, గంగప్ప, టీస్టాల్ కిట్టా, చాను, బంగారప్ప, ఎరువుల చంగారెడ్డి, బండ్ల జనార్దన, పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహానాడులో ‘మదనపల్లె జిల్లా’ ప్రకటన చేయాలి

●సీఎం, మంత్రి లోకేశ్ మాట నిలబెట్టుకోవాలి

● జిల్లా సాధన కమిటీ కన్వీనర్ పీటీఎం శివప్రసాద్

మదనపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): మహానాడులో మదనపల్లె జిల్లాను ప్రకటించి, సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేశ్ మాట నిలబెట్టుకోవాలని జిల్లా సాధన సమితి కన్వీనర్ పీటీఎం శివప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శివప్రసాద్ మాట్లాడుతూ రెండేళ్ల క్రితం మదనపల్లెలో నిర్వహించిన మినీ మహానాడులో టీడీపీ జాతీయ అధ్యక్షుడి హోదాలో, గతేడాది మదనపల్లె బెంగళూరు బస్టాండులో జరిగిన ఎన్నికల బహిరంగ సభలోనూ సీఎం మాటిచ్చారని, ఈసందర్భంగా ఆయన గుర్తుచేశారు. వైసీపీ ప్రభుత్వం మదనపల్లెకు అన్యాయం చేసిందని, తాము అధికారంలోకి రాగానే, మదనపల్లెను జిల్లాగా ప్రకటిస్తామని హామీ ఇచ్చారని శివప్రసాద్ ప్రశ్నించారు.యువగళం పాదయాత్ర సందర్భంగా నారా లోకేశ్, రొంపిచెర్ల, మదనపల్లె సభల్లోనూ మాట్లాడుతూ తాము అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో మదనపల్లె, పుంగనూరు, పీలేరు, తంబళ్లపల్లె నియోజకవర్గాలను కలిపి మదనపల్లె జిల్లా కేంద్రంగా ఉంటుందని ప్రకటించారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా..ఆ ఊసే ఎత్తడం లేదని నిలదీశారు. అన్ని అర్హతలున్న మదనపల్లెను కాదని రాజకీయ అవకాశవాదంతో అన్నమయ్య జిల్లా ఏర్పాటు చేసి, రాయచోటిని జిల్లా కేంద్రం చేశారని ఆయన విమర్శించారు. తక్షణం జిల్లా ప్రకటన చేసి మాట నిలబెట్టుకోవాలని



మీడియా సమావేశంలో పీటీఎం శివప్రసాద్

లేకుంటే, వైసీపీకి పట్టిన గతే రానున్న ఎన్నికల్లో కూటమికి కూడా పడుతుందని పీటీఎం శివప్రసాద్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి నాయకులు ముత్యాల మోహన్, టి.ఎ.ఫీర్‌బాషా, కోనేటి దివాకర్‌రావు, బురుజు రెడ్డిప్రసాద్,గంగాధర్, రవిశంకర్, బి.నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణ మందు పిచికారీ

పెద్దతిప్పసముద్రం మే 28 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆదర్శ పాఠశాల, బీసీ హాస్టల్, కస్తూరిబా పాఠశాలల్లో బుధవారం దోమల మందు పిచికారీ చేశారు. వైద్య సిబ్బంది, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మన శరీరానికి మనమే డాక్టర్

● పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు


పీలేరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు, ప్రముఖ గైనిక్ స్పెషలిస్ట్ డాక్టర్ మమత లక్ష్మి, ఎంపీడీఓ శివశంకర్ తెలిపారు. బుధవారం పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో మినీ యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానసిక ఆందోళన, ఒత్తిడి కారణంగా రోగాల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి నుంచి బయట పడేందుకు యోగా తప్పనిసరి అన్నారు. పని ఒత్తిడి, బిజీ కార్యక్రమాలు ఎన్ని ఉన్నా రోజూ కొంత సమయం యోగా చేయడం వల్ల మానసికంగా దృఢంగా తయారవుతామని తెలిపారు. దశాబ్ద కాలంగా యోగా పట్ల అందరూ ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. యోగా సాధనతో కలిగే ఉపయోగాలను గుర్తించి ప్రతి ఒక్కరూ రోజూ సాధన చేయాలని పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ ఉదయం గంటసేపు ఉచిత యోగా శిక్షణ ఇస్తున్నామని, ఆసక్తి గల


యోగా సాధన చేస్తున్న అధికారులు ప్రజలు

వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన శరీరానికి మనమే డాక్టర్లమని చెప్పారు. యోగా చేయడం వల్ల జీవితంలో డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం యోగాను పాఠశాల విద్యలో భాగస్వామ్యమం చేయడం అభినందనీయమన్నారు. షీ దివ్యయోగా విద్యాలయం అధినేత్రి పీవీఎస్ లక్ష్మి, ఎంఈవో పద్మావతి, డిప్యూటీ ఎంపీడీవో లతీఫ్ కాన్, ఈవో గురుమోహన్, సచివాలయ, అంగన్‌వాడీ, ఐసీడీఎస్, మెడికల్, టీచర్లు పాల్గొన్నారు.

పంటకుంటలతో నీటి సామర్థ్యం మెరుగు

తంబళ్లపల్లె, మే 28(ఆంధ్రజ్యోతి): పంటకుంటలతో వర్షపు నీరు నిల్వ ఉండి బోర్లలో నీటి సామర్థ్యం పెరుగడంతో పాటు, నీరు పంటకు ఉపయోగపడుతుందని ఉపాధి ఏపీడీ నందకుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఏపీడీ తంబళ్లపల్లెలో చేపడుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. మస్టర్లను పరిశీలించి కూలీలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంత రం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ... వ్యవసాయ పొలాల్లో పంటకుంటలు తవ్వుకోవడం వలన బహుళ ప్రయోజనాలున్నాయన్నారు. మండలంలోని 21 గ్రామాల్లో 450 పంటకుంటలు మంజూరు కాగా, ఇప్ప టికి 185 పూర్తయినట్లు తెలిపారు. మిగిలిన వాటిని ఈ నెలాఖరు లోపు పూర్తి చేసే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్లు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో జాబ్ కార్డు ఉన్న ప్రతి


పనులను పరిశీలిస్తున్న ఏపీడీ నందకుమార్‌రెడ్డి

ఒక్కరూ పనులకు వచ్చే విధంగా చొరవ చూపి కూలీల సంఖ్య పెంచాలన్నారు. ముఖ్యంగా ఉపాధిలో పండ్ల తోటలు, గడ్డి పెంప కంపై రైతులకు అవగాహన కల్పించి సాగు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీవో అంజినప్ప, టీఏలు సుజాత, పుష్పకుమారి, భూదేవి, ఫీల్డ్ అసి స్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లాలో కేవీకే ఆధ్వర్యంలో రైతు సదస్సులు

కలికిరి, మే 28 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతులను ఆధునిక వ్యవసాయ పద్ధతుల వైపు ప్రోత్సహించి అవగాహన కల్పించడం కోసం గురువారం నుంచి జిల్లాలోని అన్ని మండలాల్లో వరుసగా రైతు సదస్సులు నిర్వహించనున్నట్లు కోఆర్డినేటర్ మంజుల తెలిపారు. కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ, భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో వికసిత్ కృషి సంకల్ప అభియాన్ పేరుతో కొత్త రకం వంగడాలు, ఆధునిక యాంత్రీకరణ పద్ధతులు, పశు పోషణ, ప్రభుత్వ పథకాలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నా మన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యాన అధి కారులు, విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు, నిపుణులు పాల్గొంటారని చెప్పారు. గురువారం జిల్లాలోని కేవీ పల్లె మండలం తిమ్మాపురం, వాల్మీకిపురం మండలంలోని చారాల వాండ్లపల్లె, కోడూరు మండలంలోని గంగరాజుపోడు గ్రామాల్లో రైతు సమావేశాలు నిర్వహిస్తారని మంజుల వివరించారు. శుక్రవారం బయ్యప్పగారిపల్లె (బి.కొత్తకోట), డి.అబ్బవరం (రాయచోటి), తలపుల (పీలేరు), శనివారం పొన్నేటిపాలెం (మదనపల్లె), తెట్టు(కురబలకోట), ఆకేపాడు (రాజంపేట), ఆదివారం విఠలం (వాల్మీకిపురం), పెద్దివీడు (వీరబల్లి), బూర్లపల్లె (పీటీఎం)లలో నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. ఈ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా కొనసాగిస్తామన్నారు.

డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించండి

మదనపల్లె టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్‌కు డీఏ అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందించారు. బుధవారం మదనపల్లెలో కలెక్టర్ శ్రీధర్ చామకూరిని కలిసిన డీఏ అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ సచివాలయాల్లో కేవలం డిజిటల్ అసిస్టెంట్లు మాత్రమే అందుబాటులో ఉంటుండగా మిగిలిన శాఖల సిబ్బంది క్షేత్రస్థాయిలో విధులకు హాజరవుతున్నారన్నారు. దీంతో సచివాలయాలకు వచ్చే ప్రజలు నేరుగా డిజిటల్ అసిస్టెంట్లపైనే ఆధారపడుతుండడంతో తమపై ఒత్తిడి పెరుగుతోందన్నారు. వారంలో మూడు రోజుల పాటు మిగిలిన శాఖల సచివాలయ సిబ్బంది సాయంత్రం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయాల్లో అందుబాటులో ఉండేలా ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. అలాగే డీఏలు పనిచేసే చోట వారి రక్షణ కోసం క్యాషియర్ క్యాబిన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. సచివాలయాల సిబ్బందిపై దాడులు జరగకుండా తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌లోని డీఏల అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


కలెక్టర్ శ్రీధర్‌కు వినతి పత్రం ఇస్తున్న డిజిటల్ అసిస్టెంట్లు

సినిమా థియేటర్లలో తనిఖీలు

పీలేరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అజంతా, షకూర్ సినిమా హాళ్లను బుధవారం తహసీల్దార్ భీమేశ్వరరావు తనిఖీ చేశారు. సీటింగ్ ఏర్పాట్లు, మరుగు దొడ్లను పరిశీలించారు. ఆహార పదార్థాలు, శీతల పానీయాల ధరలు, రికార్డులను పరిశీలించారు.ప్రేక్షకులు తమ వెంట తినుబండారాలు తీసుకురావద్దని పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేసిన యాజమాన్యాలు శీతల పానీయాలు, తినుబండారాల ధరల పట్టిక ఎక్కడా డిస్‌ప్లే చేయకపోవడం గమనించారు. వీఆర్‌వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.


సినిమా థియేటర్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ భీమేశ్వర్ రావు

మదనపల్లె అర్బన్: పట్టణంలోని శ్రీకృష్ణ ఏసీ, సిద్ధార్థ, మినీ సిద్దార్థ, సాయిచిత్ర ఏసీ, రవి, సునీల్, ఏఎస్‌ఆర్ థియేటర్లను బుధవారం మదనపల్లె తహసీల్దార్ ధనంజయులు తనిఖీ చేశారు. పారిశుధ్య నిర్వహణ, రికార్డులు, పర్మిట్లను పరిశీలించారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే టిక్కెట్లు అమ్మాలన్నారు. ఏసీలు తప్పనిసరిగా విని యోగించాలని సూచించారు. ఆర్‌ఐ భరత్‌కుమార్‌రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ధోబీఘూట్ ఆక్రమణపై ఫిర్యాదు

పీలేరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ధోబీ ఘాట్‌కు ప్రభుత్వం కేటాయించిన స్థలాన్ని ఓ రైతు చదును చేస్తున్నాడని తహసీల్దారుకు ఫిర్యాదు అందింది. పీలేరు పట్టణ శివారులోని సర్వే నెంబర్ 1/1, 1/24 లలో 1.53 ఎకరాల స్థలాన్ని రెండు దశాబ్దాల క్రితం ప్రభుత్వం ధోబీఘాట్‌కు కేటాయించింది. కాగా, ఈ స్థలాన్ని ఓ రైతు ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్నాడని భగవాన్ శ్రీ రమణ మహర్షి రజక సంఘం అధ్యక్షుడు రెడ్డిముని బుధవారం పీలేరు తహసీల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. ఆక్రమణల కారణంగా ధోబీఘూట్ స్థలం ప్రస్తుతం ఒక ఎకరా కూడా లేదన్నారు. ఆక్రమణలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదుపై స్పందించిన తహసీల్దార్ భీమేశ్వరరావు విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. తహసీల్దార్‌ను కలసిన వారిలో రజక సంఘం నేతలు బాలమురళి, శివ, వెంకట్రమణ, భాస్కర్, శేఖర్ తదితరులు ఉన్నారు.


ధోబీఘూట్ స్థలాన్ని ఎక్స్‌కవేటర్‌తో చదును చేస్తున్న దృశ్యం

ఉరుసులో అలరించిన ఖవ్వాలీ

పీలేరు, మే 28(ఆంధ్రజ్యోతి): హజరత్ మహబూబ్ సుబహాని ఉరుసులో భాగంగా మంగళ వారం రాత్రి ఏర్పాటు చేసిన ఖవ్వాలీ పీలేరు పట్టణ వాసులను అలరించింది. కలకడ, కలికిరి, వాల్మీకిపురం, రొంపిచెర్ల, చిన్నగొట్టిగల్లు నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. ఉరుసు సందర్భంగా కొనుగోళ్లు చేసేందుకు మహిళలు పోటెత్తడంతో దుకాణాలు బుధవారం ఉదయం వరకు తెరిచే ఉన్నాయి. ఇక పిల్లల కోసం ఏర్పాటు చేసిన జెయింట్ వీల్, పడవ, జంపింగ్ బెడ్స్, రివాల్వింగ్ చైర్స్ వద్ద ఎడతెగని రద్దీ నెలకొంది. పీలేరు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.


ఖవ్వాలీలో పాల్గొన్న గాయకులు

నెలసరిపై అపోహలు వీడాలి

మదనపల్లె టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): కౌమార బాలికలు, మహిళలు నెలసరిపై అపోహలు, మూఢ నమ్మకాలను వీడాలని పోర్డు సంస్థ డైరెక్టర్ జె.లలితమ్మ సూచించారు. బుధవారం మండలంలోని ఆరోగ్యవరం మెడికల్ సెంటర్ నర్సింగ్ కళాశాలలో నెలసరి పరిశుభ్రత దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నెలసరి సమయంలో పరిశుభ్రతతో పాటు, మహిళలు తీసుకోవాల్సిన ఆరోగ్య సూత్రాలు వివరించారు. దేశంలో ప్రతి పౌరురాలికి రాజ్యాంగం పలురకాల హక్కులు కల్పించిందని, అందులో ఇది కూడా ఒక హక్కే అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ టోని, గాయత్రి, పోర్డు సిబ్బంది నరసింహ, జయలక్ష్మి, స్వర్ణ, జలజ, సుభాషిణి, విద్యార్థినులు పాల్గొన్నారు.



నెలసరి పరిశుభ్రత దినోత్సవంలో మాట్లాడుతున్న పోర్డు లలితమ్మ

ఆస్తుల కన్నా విజ్ఞానం గొప్పది

మదనపల్లె టౌన్, మే 28(ఆంధ్రజ్యోతి): సిరి సంపదలు, ఆస్తుల కన్నా విజ్ఞానం చాలా గొప్పదని బీజేపీ సీనియర్ నాయకుడు గుత్తా హరికృష్ణ తెలిపారు. బుధవారం ఏబీవీపీ ఆధ్వ ర్యంలో నిర్వహించిన సమ్మర్‌క్యాంపు ముగిసింది. ఈ కార్యక్రమంలో హరికృష్ణ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత చదువులతో దేశ భవిష్యత్‌ను మార్చేందుకు కృషి చేయాలన్నారు. ఏబీవీపీ ఇటు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు సాయిహితేష్, ఆర్‌ఎస్ ఎస్ విభాగ్ రెడ్డెప్ప, శిక్షకులు మధుకర్‌రెడ్డి, విద్యాధరరావు, చంద్రశేఖర్‌రెడ్డి, సాయిప్రకాష్‌రెడ్డి, గౌత మ్, గిరీష్, యువరాజు పాల్గొన్నారు.


విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న బీజేపీ నాయకుడు హరికృష్ణ

మహానాడుకు భారీగా తరలిరండి

పెద్దమండ్యం, మే 28(ఆంధ్రజ్యోతి) మహానాడు చివరి రోజైన గురువారం టీడీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని పెద్దమండ్యం మండల టీడీపీ నేతలు సిద్ధవరం ప్రసాద్, సుమన్‌కుమార్, యుగంధర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పెద్దమండ్యంలో బుధవారం మహానాడుకు భారీ బహిరంగ సభకు విజయవంతం కోసం సమావేశం నిర్వహించారు. మండల టీడీపీ నేతలు సిద్ధవరం ప్రసాద్, సుమన్‌కుమార్, యుగంధర్‌రెడ్డి, మేకల చలపతి, ఇస్మాయిల్, చంద్రారెడ్డి, గల్లానారాయణ, ప్రభాకరరెడ్డి, నాగార్జున, ప్రసాద్, రామాంజులు, చలపతినాయుడు, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మండల టీడీపీ నేతలు

జిల్లా టీడీపీ అధ్యక్షుడిని కలిసిన మండల నాయకులు

పెద్దతిప్పసముద్రం మే 28 (ఆంధ్రజ్యోతి) : మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు మహానాడు రెండవ రోజు అన్నమయ్య జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడైన చమర్తి జగన్‌మోహన్‌రాజును మర్యాద పూర్వకంగా కలిశారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ స్థితిగతులపై ఆయనతో చర్చించారు. మహానాడు కార్యక్రమానికి మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు కార్యకర్తలు హాజరైనట్లు తెలిపారు. మండలంలోని కూటమి నేతలు కలిసికట్టుగా ఉంటే సంస్థాగత ఎన్నికల్లో పార్టీకి పూర్వ వైభవం వస్తుందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని కార్యకర్తలు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఆయనను కలిసిన వారిలో మొలకలచెరువు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనాథ్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు గూటం ఈశ్వరప్ప, మండల టీడీపీ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ఇ.వి. రమణ, సురేష్ తదితరులు ఉన్నారు.


జగన్‌మోహన్‌రాజుతో పీటీఎం మండల నాయకులు

వైభవంగా గంగమ్మజాతర

కలకడ, మే 28(ఆంధ్రజ్యోతి):మండలంలోని బాటవారిపల్లె బీసీ కాలనీలో బుధవారం గంగమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మంగళవారం రాత్రి నుంచి బుధవారం వేకువజాము వరకు బళ్లారిడ్రమ్ములు, చెక్కభజనలు, బాణసంచా నడుమ చాందినీ బండిలో ఊరేగించారు. మహిళలు బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ప్రజలు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించారు.